క్లుప్తంగా

26న శివపార్వతుల కల్యాణం

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 26వ తేదీన శివపార్వతుల కల్యాణ (మహాశివరాత్రి) మహోత్సవం సందర్భంగా బుధవారం వేదపడింతులు, ఆలయ నిర్వాహకులు శుభలగ్న పత్రికను గ్రామపెద్దలకు అందజేసినట్లు ఆలయ చైర్మన్ మడుగూరి ప్రసాద్ తెలిపారు. శివరాత్రి వేడుకలను అత్యంత వైభవంగా జరిపేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

యూనిఫాం అందజేత



గోవిందరావుపేట : మండలంలోని చల్వాయి అంగన్‌వాడీ సెంటర్–2లో చిన్నారులకు అంగన్‌వాడీ టీచర్ అంపోజ్వాల అరుంధతి ఆధ్వర్యంలో జెడ్పీహెచ్ఎస్, సీపీఎస్ ప్రధానోపాధ్యాయులు చంద్రారెడ్డి, సమ్మయ్య, డాక్టర్ అనూష బుధవారం యూనిఫాం అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం కౌశిక, ఆశ కార్యకర్తలు స్వరూప, భారతి, తల్లిదండ్రులు లక్ష్మీప్రియ, సంధ్య, భాగ్యమ్మ పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ఏటూరునాగారం : మండల కేంద్రంలోని ఓడవాడ అభయాంజనేయస్వామి ఆలయంలో భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మూడో వార్షికోత్సవ కార్యక్రమాలను ఘనంగా బుధవారం నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు, నాయకులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రసాద్, కిరణ్, లాలయ్య, రాంలాల్, మహేష్, వీరన్న, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామకమిటీ ఎన్నిక



గోవిందరావుపేట : డప్పు కళాకారుల సంఘం గ్రామకమిటీని బుధవారం ఆ సంఘం మండల అధ్యక్షుడు బైరుపాక రమేశ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా పోలేపాక కుమార్, ఉపాధ్యక్షుడిగా కేశపాక కార్తీక్, గౌరవ అధ్యక్షుడిగా జన్ను సాంబయ్య ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ అధ్యక్షుడు దర్శనాల సంజీవ్, మండల కమిటీ కార్యదర్శి బొచ్చు రవి, సభ్యులు జన్ను రవి, కుక్కల వెంకన్న, భిక్షపతి, కట్ల ఐలయ్య, లింగయ్య, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఆదాయానికి గండి



ములుగు రూరల్ : మినీ మేడారం జాతర సందర్భంగా గట్టమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసే దుకాణాలను గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో టెండర్లు నిర్వహించి ఆదాయాన్ని భక్తుల కోసం ఖర్చు చేసేదని జాకారం మాజీ సర్పంచ్ దాసరి రమేష్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కోర్టు ఆర్డర్‌ను ధిక్కరించి అధికారులు గట్టమ్మ వద్ద దుకాణాలను ఏర్పాటు చేయడంతో పంచాయతీ ఆదాయానికి వాటిల్లనుందని అన్నారు. అధికారులు గట్టమ్మ ఆలయం వద్ద గతంలో మాదిరిగా పంచాయతీ ఆధ్వర్యంలో టెండర్లు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

జేఈఈ ఫలితాల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

ములుగు రూరల్: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో మండల పరిధిలోని ఇంచర్లలోని తెలంగాణ గిరిజన గురుకుల కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ ఝాన్సీరాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుకుల కళాశాలకు చెందిన జర్పుల అనిల్ 91 పర్సంటైల్, బానోతు ప్రవీణ్ 49, బోడ అంజి, మాలోత్ సిద్ధులు 41 పర్సంటైల్ సాధించారని వివరించారు. జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

మిర్చిపంట క్షేత్ర సందర్శన

ఏటూరునాగారం : మిర్చి సాగులో రైతులు మెళకువలు పాటించాలని పీఏసీఎస్ చైర్మన్ కూనూరు అశోక్ తెలిపారు. బుధవారం మండలంలోని పలువురు రైతుల పంట క్షేత్రాల్లో సందర్శన కార్యక్రమం చేపట్టారు.

వనజాతరలు ప్రారంభం



కన్నాయిగూడెం: ఐలాపూర్‌కు సారలమ్మను తీసుకొస్తున్న పూజారులు



ఏటూరునాగారం: దొడ్లలోని సారలమ్మ గుడికి వెళ్తున్న గోవిందరాజుల పడిగె

- సర్వాయి నుంచి ఐలాపూర్ చేరుకున్న సారలమ్మ
- సారలమ్మ రాకతో ప్రారంభమైన మినీ జాతర

కన్నాయిగూడెం : మండలంలోని ఐలాపూర్ గ్రామంలో జరిగే వన దేవతల జాతర బుధవారం సర్వాయి నుంచి సారలమ్మ రాకతో ప్రారంభమైంది. ప్రధాన పూజారి నల్లెబోయిన మోహన్‌రావుతో కలిసి పూజారులు, వడ్డెలు ఆదివాసీ సాంప్రదాయం ప్రకారం భక్తిశ్రద్ధలతో సారలమ్మను పూజించారు. దేవారబాలవాసం లక్ష్మణ్‌రావు పై సారలమ్మ పూనడంతో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పూజారులు సారలమ్మను ఐలాపూర్‌కు 12 కిలోమీటర్లు కాలినడకను తీసుకోని బయలు దేరారు. ఐలాపూర్‌లోని సమ్మక్క సన్నిధిలో సారలమ్మను గద్దె పై పూజలు చేసి ప్రతిష్టించారు. నేడు (గురువారం) ఉ దయం వనంలో నుంచి పూజారులు ఆదివాసీ సాంప్రదాయాలతో పూజలు చేసి వనంను తీసుకొచ్చి సమ్మక్క గద్దెపై ప్రతిష్టిస్తారు. సాయంత్రం కొండాయి ప్రాంతంలో ఉన్న దేవరగుట్ట నుంచి సమ్మక్కను ఆదివాసీలు ఐలాపూర్‌లోని మల్లెల వంశస్తులతో కలిసి సమ్మక్కను తీసుకువస్తారు. గ్రామపెద్దలు, మేడారం ట్రస్టుబోర్డు డైరెక్టర్ పొడెం శోభన్, నల్లెబోయిన సమ్మన్న, మాజీ సర్పంచ్ కోరం రాజు, గంగరాజు, ముకుందరావు, సంపత్, హన్మంత్, నల్లెబోయిన దామోదర్ తదితరులు ఉన్నారు.

బయ్యక్కపేటలో జాతర ప్రారంభం

ఎస్ఎస్ తాడ్వాయి : మండలంలోని బయ్యక్కపేటలో సమ్మక్క, సారలమ్మ జాతర బుధవారం ప్రారంభమైంది. బుధవారం చంద వంశస్తుల పూజారులు (తలపతులు), వడ్డెలు, కుల పెద్దల ఆధ్వర్యంలో ఊరు పొలిమేరలో మామిడి తోరణాలు కట్టి గ్రామ దిగ్బంధనం నిర్వహించారు. నేడు (గురువారం) సమ్మక్క గుట్ట నుంచి గద్దె పైకి రానున్న సందర్భంగా ముందస్తుగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మామిడి ఆకులతో కంకణాలు, తోరణాలను అమ్మవారి గద్దె చుట్టూ అలంకరించారు. ఈ సందర్భంగా గ్రామదేవతలకు కూడా పూజలు నిర్వహించారు.



కన్నాయిగూడెం: కాలినడకన ఐలాపూర్‌కు బయలుదేరిన సారలమ్మ



కన్నాయిగూడెం: బూర ఊదుతున్న పూజారి



మంగపేట: నెమల్లగుట్ట ఆలయం వద్ద పూజారులు



ఎదుర్కోలు నిర్వహిస్తున్న పూజారులు, వడ్డెలు

నెమల్లగుట్టలో..

మంగపేట : మండలంలోని బుచ్చంపేట పరిధిలోని జబ్బోనిగూడెం నెమల్లగుట్టలో సమ్మక్క, సారలమ్మ, నాగులమ్మ జాతర ప్రారంభమైంది. జాతరలో రెండో రోజు పూజారి (దేవరబాల) కుంట్ల నరేష్ రహస్య పూజలు నిర్వహించారు. గద్దెల నుంచి జోలి వాయిద్యాల నడుమ అమ్మవారి ఊరేగింపు, జోగు తిరుగుట కార్యక్రమాన్ని నిర్వహించి కోమటిపల్లిలో లక్ష్మీదేవర, సమ్మక్క–సారలమ్మకు ఎదుర్కోలు నిర్వహించారు.



లక్ష్మీదేవరకు ఎదుర్కోలు నిర్వహిస్తున్న వడ్డెలు



ఎస్ఎస్ తాడ్వాయి: పూజా సామగ్రిని సిద్ధం చేస్తున్న పూజారులు

దొడ్లలోని సారలమ్మ గుడికి గోవిందరాజుల పడిగె

ఏటూరునాగారం : మండలంలోని దొడ్ల నుంచి ప్రత్యేక పూజలు, ఆదివాసీ సాంప్రదాయాలతో సారలమ్మ కొండాయికి చేరుకుంది. సారలమ్మను కాక వెంకటేశ్వర్లు గద్దెలపై ప్రతిష్ఠించారు. ముందుగా గోవిందరాజుల పడిగెను పూజారులు దబ్బగట్ల గోవర్దన్, రాజారాంలతోపాటు వడ్డెలు దొడ్లలోని సారలమ్మ గుడికి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. గోవిందరాజుల పడిగె వస్తేనే సారలమ్మను తీసుకురావడం ఆనవాయితీగా వస్తోంది. అనంతరం సారలమ్మ, గోవిందరాజుల పడిగె కలిసి కొండాయి చేరుకున్నారు. సారలమ్మను గద్దెపై ప్రతిష్ఠించగా గోవిందరాజును గురువారం దేవర గుట్ట నుంచి వడ్డెర కుండలలో తీసుకువచ్చి గద్దెమీద ప్రతిష్ఠిస్తారు. నేడు (గురువారం) గోవిందరాజులు, నాగులమ్మ గద్దెలపై ప్రతిష్ఠ ఉంటుందని పూజారులు తెలిపారు.



ఎస్ఎస్ తాడ్వాయి: మామిడి తోరణాలు కట్టి గ్రామ దిగ్బంధనం చేస్తున్న ఆదివాసీలు

ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి

- జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్



అధికారులకు సూచనలిస్తున్న డీపీఓ దేవరాజ్

ములుగు : స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) ఒంటేరు దేవరాజ్ సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో బుధవారం ఎన్నికల రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి డీపీఓ హాజరై పలు సూచనలు చేశారు. ఎన్నికల సంఘం నియమాలకు లోబడి నిష్పక్షపాతంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. మొదటి, రెండోదశ గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ అనంతరం ఉపసర్పంచ్ ఎన్నికను నిబంధనల మేరకు నిర్వహించేలా చూడాలన్నారు. అనంతరం ట్రైనర్ల ఆధ్వర్యంలో నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు, కౌంటింగ్ నిర్వహణ ఎలాంటి విబేధాలకు తావులేకుండా చూడాలని ఆర్ఓ, ఏఆర్ఓలకు సూచించారు. ఎంపీడీఓ రామకృష్ణ, మల్లంపల్లి ఎంపీడీఓ రహీమొద్దీన్, మాస్టర్ ట్రైనర్లు సతీశ్‌కుమార్, హమీద్, సూర్యనారాయణ, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్, రమేష్, మధు, రాజేష్, రవీందర్ పాల్గొన్నారు.

‘పది’ పరీక్షలకు సిద్ధం చేయాలి

- డీఈఓ పాణిని



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఈఓ పాణిని

మంగపేట : పదోతరగతి వార్షిక పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని, జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేజీబీవీలోని 10వ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. పౌష్టికాహారంపై ఆరా తీశారు. కేజీబీవీ, జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పదోతరగతి విద్యార్థులను వార్షిక పరీక్షలకు సంసిద్ధం చేసేందుకు తగు సూచనలు చేశారు. ప్రతిరోజూ స్పెషల్ క్లాసులు నిర్వహిస్తూ సాయంత్రం స్నాక్స్ అందించాలని ఆదేశించారు. ఎంఈఓ పొదెం మేనక, కేజీబీవీ స్పెషలాఫీసర్ భాగ్యలక్ష్మి, ఆయా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదివాసీలపై అక్రమ కేసులా?

- ఆదివాసీ ప్రజా సంఘాల జేఏసీ మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు



మాట్లాడుతున్న నాగరాజు

మంగపేట : ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చిన గొత్తికోయ గిరిజనులను ప్రోత్సహిస్తు స్థానిక ఆదివాసీ గిరిజనులపై కేసులు నమోదు చేస్తున్న అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి కోటేశ్వర్, బీట్ ఆఫీసర్ చాట్ల నరేష్‌పై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ ప్రజా సంఘాల జేఏసీ మండల ప్రధాన కార్యదర్శి తాటి నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని గంపోనిగూడెంలో 20 ఏళ్లుగా పోడుసాగు చేస్తున్న ఆదివాసీ గిరిజనులపై అటవీశాఖ అధికారులు కేసులు నమోదు చేస్తు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన వలసవాదులు మంగపేట ఏజెన్సీలో వందల ఎకరాల్లో అటవీని నరికి పోడుభూములు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఆదివాసీ గిరిజనులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చిన వారిలో చాలా మంది ఎస్సీ, బీసీ కులాలకు చెందిన వారు స్థానికంగా ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు పొంది గిరిజనులమని చెప్పుకుంటున్నారని వివరించారు. వలసలతో ఏజెన్సీలో గిరిజనుల భూములకు, గిరిజన చట్టాలకు ఆటంకం కలుగుతుందన్నారు. తక్షణమే వలస వాదాన్ని నిలిపి అడవిలో చెట్లను నరకకుండా, అటవీ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని అధికారులను కోరారా. లేనిపక్షంలో మంగపేట అటవీ రేంజ్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అన్నెబోయిన సమ్మయ్య, జబ్బ నరేష్, పూనెం రాములు, మేకల సమ్మయ్య, సోయం సురేష్, రెడ్డి లక్ష్మయ్య, కేశవరావు, తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో కిరాణం దగ్ధం

- రూ.12 లక్షల ఆస్తి నష్టం, బూడిదైన రూ.లక్ష నగదు



షార్ట్ సర్క్యూట్‌తో కాలి బూడిదైన కిరాణం షాపు

గోవిందరావుపేట: మండలంలోని పస్రా గ్రామానికి చెందిన బొల్ల అశోక్ కిరాణా దుకాణంలో బుధవారం షార్ట్ సర్క్యూట్ అయ్యింది. షాపులోని సామగ్రి, ఇతర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.12 లక్షల ఆస్తి నష్టం కావడంతో పాటు రూ.లక్ష నగదు కాలి బూడిదైంది. లింగాలకు వెళ్లే దారిలో అశోక్ కొన్నాళ్లుగా షాపును అద్దెకు తీసుకుని నడిపిస్తున్నాడు. మేడారంలో అమ్మవార్లని దర్శనం చేసుకునేందుకు మధ్యాహ్నం సుమారు ఒంటి గంట సమయంలో షాపుని మూసేశాడు. కొద్దిసేపటికి షాపులో నుంచి పొగ రావడాన్ని గమనించిన స్థానికులు అశోక్‌కు ఫోన్ చేసి సమాచారమిచ్చారు. తిరిగి వచ్చే సరికి సామగ్రి, వస్తువులు మొత్తం కాలి బూడిదయ్యాయి. ప్రమాదంతో తాము రోడ్డున పడ్డామని, ప్రభుత్వం ఆదుకోవాలని అశోక్ కోరుతున్నాడు.

మేడారం తరలిన భక్తులు



వాహనంలో మేడారం జాతరకు వెళ్తున్న భక్తులు

వాజేడు : ఎస్ఎస్‌తాడ్వాయి మండలంలో సమ్మక్క, సారక్క జాతర మొదలు కావడంతో బుధవారం భక్తులు వాహనాల్లో కుటుంబ సమేతంగా తరలి వెళ్లారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి భక్తులు ట్రాక్టర్, ఆటోలు, ఇతర వాహనాల్లో దర్శించుకునేందుకు వెళ్లారు.

ఐలాపుర్ జాతరలో వైద్యశిబిరం



ఐలాపుర్ జాతరలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరం

కన్నాయిగూడెం : మండలంలోని ఐలాపుర్‌లో బుధవారం నుంచి వన జాతర ప్రారంభం కావడంతో మండల వైద్యశాఖ కొండాయి, ఐలాపుర్ జాతరలో వైద్యశిబిరం ఏర్పాటు చేసింది. సర్వాయి నుంచి ఐలాపుర్ గ్రామానికి సారలమ్మ రాకతో జాతర ప్రారంభం కానుంది. వన దేవతల జాతరకు అధిక సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకుంటారు. ఐలాపుర్‌లోని సమ్మక్క సన్నిధి పరిసర ప్రాంతంలో స్థానిక వైద్యులు అభినవ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.అత్యవసరమైతే మెరుగైన వైద్యం అందించే విధంగా 108 సేవలను అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంసీహెచ్ వైద్యులు ఎం. గిరిబాబు, వరప్రసాద్, సుజాత, శారద, మనిషా, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

బయ్యక్కపేటలో ప్రత్యేక పూజలు



బయ్యక్కపేటలో గద్దెల వద్ద పూజలు చేస్తున్న లక్ష్మీనర్సింహారావు, బీఆర్ఎస్ నాయకులు

ఏటూరునాగారం : తాడ్వాయి మండలంలోని బయ్యక్కపేటలో సమ్మక్క,సారలమ్మ గద్దెల వద్ద బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు, నాయకులు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. మినీ మేడారం సందర్భంగా బయ్యక్కపేటలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మేడారం చేరుకొని సమ్మక్క, సారలమ్మను దర్శించుకున్నారు. నాయకులు తుమ్మ మల్లారెడ్డి, పోరిక గోవింద నాయక్, కాకులమర్రి ప్రదీప్‌రావు, మండల అధ్యక్షుడు గడదాసు సునీల్‌కుమార్, తాడూరి రఘు, వలిబాబా, వివిధ మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు ఉన్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత



అవగాహన కల్పిస్తున్న ఫారెస్ట్ అధికారులు

వెంకటాపురం(కె) : అడవులను రక్షణ అందరి బాధ్యత అని వెంకటాపురం సెక్షన్ అధికారి దేవయ్య పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని నూగూరు, మహితాపురం గ్రామస్తులకు అడవుల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవికి నిప్పు పెట్టడం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోందన్నారు. అడవుల సంరక్షణతోనే స్వచ్ఛమైన గాలి లభిస్తుందని తెలిపారు. అడవికి నిప్పు పెడితే జీవరాశులకు నీడ, ఆహారం లభించక అంతరించి పోతాయని సూచించారు. ప్రజలు అడవిలోకి ఇప్పపువ్వు, చీపుర్ల సేకరణకు వెళ్లినప్పుడు నిప్పు పెట్టకుండా ఇప్ప చెట్ల కింద పరదాలు పర్చుకొని సేకరించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీట్ అధికారులు ప్రణవి, సరళ, గొంది నారాయణ, బ్యాస్ సిబ్బంది లక్ష్మయ్య, నరేష్, రమేష్, క్యూఆర్‌టీ సభ్యులు రమేష్, సురేష్ ఉన్నారు.

పరిమితికి మించి తరలించొద్దు



అవగాహన కల్పిస్తున్న ఎస్సై తిరుపతి రావు

వెంకటాపురం(కె) : వాహనాల్లో పరిమితికి మించి కూలీలను తరలించొద్దని వెంకటాపురం ఎస్సై తిరుపతి రావు అన్నారు. బుధవారం మండలంలోని ఆలుబాక గ్రామ సమీపంలో ముత్తారం క్రాస్ వద్ద ఎస్సై తన సిబ్బందితో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ రైతులు మిర్చి కూలీలను ట్రాక్టర్‌లల్లో తరలించే క్రమంలో వాహన పరిమితికి మించి కూలీలను తీసుకుపోవద్దని అన్నారు. వాహనానికి తగిన ధ్రువపత్రాలు, డ్రైవర్ లైసెన్స్ కలిగి ఉండేలా రైతులు చూసుకోవాలని తెలిపారు. తనిఖీల్లో సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

‘మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించండి’



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రచారం చేస్తున్న శ్రీపాల్‌రెడ్డి

ములుగు : వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పీఆర్‌టీయూ టీఎస్ అభ్యర్థి పింగిలి శ్రీపాల్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో తెలంగాణ మోడల్‌స్కూల్ ఉద్యోగులు మరణిస్తే ఆ కుటుంబంలో కారుణ్య నియామకం అందించేలా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వేం యాకూబ్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి కోకిల శ్రీరంగం, దేవులపల్లి సత్యనారాయణ, జగదీశ్, కాసర్ల రమేష్, నాగేశ్వర్‌రావు, తులసిరాం, ముకుందరెడ్డి, శివప్రసాద్, రాజయ్య, శ్రీరాములు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతపై కళాజాతా



మేడారంలో అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ఎస్ఎస్ తాడ్వాయి : మేడారం అటవీ పరిసరాల్లో శుభ్రత, ప్లాస్టిక్ నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు బుధవారం తెలంగాణ సాంస్కృతిక సారధి గోల్కొండ నరేష్ బృందం కళాకారులు ఆట పాటల ద్వారా అవగాహక కల్పించారు. జాతరకు వచ్చే వేలాది భక్తులు ఎక్కడపడితే అక్కడ చెత్త వేయొద్దని, పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు రాగుల శంకర్, రవి, బుచ్చన్న, రహీముద్దీన్, సాగర్, కిషన్, రాజేందర్, తిరుపతి, భాస్కర్, రాము, శ్రీలత, శోభ, తదితరులు పాల్గొన్నారు.